# ధర్మవాహిని





భగవాన్
శ్రీ సత్యసాయిబాబా

# 3

# ఈశ్వరార్పితమైన యేకర్మ అయినా ధర్మకర్మయే

**క్రూరకర్మలు ఎపుడూ ధర్మకర్మలు కానేరవు :**

లౌకిక సుఖాపేక్షచే కానీ, రాగద్వేషోద్రేకముల ప్రేరణచే కానీ స్థలాలను మార్పుచేసినా, లోన వెన్నంటియుండు అజ్ఞానముచేత లోకమున ఎవ్వరును ఎట్టివారును శాంతిని పొందలేరు. దీపములేని ఇంటిలో ఊరక వస్తువులను అటూ ఇటూ మార్పుచేయుటచేత సర్దినట్లగునా? తప్పించుకొని తిరిగినట్లగునా? దీపము వెలిగిస్తే యెక్కడి వస్తువులు అక్కడనే యున్నను, వానిని తప్పించుకొని సులభముగా తిరగవచ్చును; అవసరమైన మార్పులు చేసికొనవచ్చును. అంతకుముందు దీపము అవసరము కదా! అట్లే అంధకారబంధురమైన ఈ ప్రపంచ గృహములో సంఘర్షణ తప్పించుకొని శాంతంగా, ధర్మంగా, సత్యంగా జీవించటానికి సాధ్యమా? కాదు. మరెట్లన, జ్ఞాన దీపారాధన ప్రధానమైనది. నేటి మానవ జీవితము ధర్మసమ్మతమే కానీ దోషమెక్కడున్నదన్న, మానవులు చేయదగిన కర్మ ఈశ్వరార్పితము కాకుండుటయందే. అట్టి ఈశ్వరార్పితమైన, యేకర్మ అయినను ధర్మకర్మయే యగును.

ఇక్కడ కొంతమంది కుశలబుద్ధికలవారు ప్రశ్నించవచ్చును; 'ఒకరిని చంపుచు, హింసించుచు, ఈశ్వరార్పితమన్న అది ధర్మకర్మ అగునా?' అని. ఈశ్వరార్పితదృష్టి ప్రాప్తించవలెనన్న, మొదట శాంతి, సత్య, ప్రేమ, అహింసలు, వానియందు నిండియుండవలెను

కదా? ఇక ఇట్టి క్రూరకర్మలకు చోటెక్కడ? ఈశ్వరార్పితమనువాడు పై నాలుగు మహాభావములను పొందినవాడైయుండవలెను. లేకున్న, క్రూరకర్మలు చేయుచు ఈశ్వరార్పణమన్న, అట్టివి ధర్మకర్మలు కానేరవు.

**ధర్మకర్మలు అమృతస్వరూపమైనవి :**

ధర్మకర్మలు అమృత స్వరూపమైనవి; వానికి మరణమే లేదు. అట్టి కర్మలు ఆచరించువాడుకూడ అమృతస్వరూపుడే. అట్టి పవిత్రకర్మ లాచరింపకయే అమృత పుత్రులైన మానవులు అనృతపుత్రులనబడుచున్నారు. ఇది ఎంత విచారకరమైన విషయము! అమృతముండియూ, విషయములు అను విషమును త్రాగటము విధియనక ఏమందురు? నిరంతరము ఆత్మచింతన చేసి, ఆత్మానందమననుభవింపక, అనిత్య, అసత్యములైన లోక వాసనలకు లోబడి దేహోద్రేకపూరితులై, ఆత్మధర్మమైన అమృతత్వమును దూరము చేసికొనుట మానవ ధర్మమెట్లగును? గీతయందుకూడ, 14వ అధ్యాయమున చెప్పిన ధర్మమందు, "నేను మోక్ష స్థానమును (అమృత స్థానమును), సనాతనమగు ధర్మ స్వరూపమును, ముఖ్యమైన నిత్యానందస్వరూపమునగు బ్రహ్మమున కాశ్రయభూతుడను", అని తెలిపెను. ఈ అర్థమును ప్రసాదించిన శ్లోకమే ఈ క్రింద కనబరచినది :

శ్లో॥ బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహమమృతస్యావ్యయస్య చ,
శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాన్తికస్య చ॥

ఈ అమృతత్వమునే ఉపనిషత్తులలో అనేక స్థలములలో ప్రతిపాదించటమైనది. ఉపనిషత్సారమే గీతయగుట వల్లా, ఈ అమృతత్వమును గీతలోను పలుసార్లు నిరూపించడమైనది.

**భగవద్ధర్మమును అనుష్ఠించువాడే భగవత్ ప్రీతికి పాత్రుడగును :**

కాన, ధర్మకర్మ అనునది సామాన్యముకాదు. అది కేవలము ఆత్మసారమే. దీనిని ఆచరించిన వారియెడ భగవంతునికికూడా అతి ప్రీతి గలుగును. భగవత్ ప్రీతికి పాత్రులు కావలెనన్న సత్య ధర్మకర్మల నాచరించవలెను. అందుకనే గీతయందు 12వ అధ్యాయమున, 12వ శ్లోకము మొదలు 19వ శ్లోకము వరకునూ ఈ భావమునే చేర్చి అర్జుననకు ఆత్మధర్మము బోధింపబడినది. గీతామృతమును పానము చేసిన త్యాగులకు ఇది సులభముగ తెలియును. అందులో ముఖ్యమగు శ్లోకమును మచ్చునకు, మీకు నచ్చుటకై వ్రాయుచున్నాను :

**శ్లో॥ యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే।**
**శ్రద్దధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః॥**

దీని యందు ఎంత భావము చేరినదో! ధర్మమునుండి తొలగనిదియు, అమృతమూ అద్వేషమూ మొదలుగాగల ధర్మ సముదాయమునందు శ్రద్ధగలిగియు, పరమాత్మయే పరమగతిగా తలంచుచు ఎవరుందురో, అట్టివారే నాకత్యంత ప్రీతిగలవారని పలికెను. అందులో "ధర్మ్యామృతం" అని ప్రయోగించుటలో ఎంత అంతరార్థమున్నదో యోచించిన మీకే గోచరము కాగలదు.

భగవద్ధర్మమును అనుష్ఠించువాడే భగవదమృతమును పానము చేయుటకు అర్హుడగును. సాధారణ జనులు, తమకు భగవంతుని యందు భక్తి యున్నదని తలంతురు. అది చాలదు; అంతటితో తృప్తిపడకూడదు. తమపై భగవంతుడు ప్రీతి గలిగియున్నాడా? అని యోచించవలెను; తలంచవలెను. ఇట్లు తలంచువారు చాలా అరుదు. అదే దీనిలో గల కీలకము.

**ఆత్మధర్మమే నిజమైన ధర్మము :**

మానవునకు అనేక ధర్మములు శరీరసంబంధ నిమిత్తమై కలిగియున్నవి. ఒక వ్యక్తి, ప్రజలకు రాజుగాను, తండ్రికి పుత్రుడుగాను, శత్రువునకు శత్రువుగాను, సతికి పతిగాను, కుమారునకు తండ్రిగాను, అనేక రీతుల ఉన్నాడు. అయిననూ, నీవెవ్వడవని అడిగిన, ఇందులో నేను రాజుననియో, తండ్రిననియో, కొడుకుననియో, వచింపగలడా? అన్నీ శరీరబంధ నిమిత్తములు కాన వచింపలేడు. అవి కర్మలచేత కలిగిన నామరూపములు గదా?

అట్లే, నేను శిరస్సును, నేను పాదమును, నేను హస్తమును ఉదరమును అని సమాధానము చెప్పలేడు. అవి వాని అవయవములు కాన, అవియే నేనని చెప్పలేడు; అది సాధ్యము కాదు. కాన సమస్తావయవములకంటెను వేరైనదిగను, నామరూపములు లేనిదిగను ఉండి, అహమని వ్యవహరింపబడుచున్న నేను ఎవ్వడనో, ఎట్లున్నానో అని విచారించి చూడుము : పై విధముగా నీ స్వరూపము నీకే దుర్భరమై యుండగా,

ఇతర స్వరూపములను గూర్చి ఇదమిత్థమని తెలుపగోరుట ఎట్లు పొసగును? నీవనియు, నేననియు, వ్యవహరింపబడుట మన శరీరములకు సంబంధించుచున్నది. కాని, ఇవి యన్నియూ సత్తులుకావు; ఆత్మ ఒకటే సత్తు; దాని ధర్మమే నిజమైన ధర్మము.

ఆత్మ, ఆత్మ, అన్న 'ఆత్మకే రూపము?' అని కొందరు అర్థము లేని ప్రశ్నలు వేతురు. ఆత్మకు రూపమెక్కడిది? అది అమృత స్వరూపము. దానిది ధర్మ స్వభావము; నిశ్చల నిర్మల గుణము. దానికి రూపనామములు అంటగట్టరాదు. ఆత్మ స్వభావమును, ఆత్మ ధర్మమును, అనుష్ఠానమునందు కర్మదేహమున ఆచరించవలెను. దేహమునకే రూపనామములు. కనుక, దేహ మాచరించు ప్రతి కర్మయందును నిరూపించవలెను. అందుకనే ఈ రీతిగా పల్కినది.

శ్లో॥ పుమాం స్త్రీ గౌరజోవాజీ కుంజరో విహగస్తరుః।
దేహేషు లోకసంజ్ఞేయం విజ్ఞేయా కర్మహేతుషు॥
పుమాన్న దేవో న నరో న పశుర్నచ పాదపః
శరీరాకృతి భేదాస్తు భూపై తే కర్మయోనయః॥

ఇందులో చూడు : ఆత్మ పురుషుడుగాను, స్త్రీగాను, పశువుగాను, మేకగాను, గుఱ్ఱముగాను, పక్షిగాను, వృక్షముగాను ఉండుటలేదు. ఈ నామరూపముల భేదములు దానికి లేవు. ఇవి అంతయు కర్మకృతములు. దేహములకే వర్తించును. ఆత్మస్వరూపము సదా వికార రహితము, ఏకరూపము. కాన దానిని 'సత్' అని వ్యవహరింతురు. అనగా పరమార్థమనే భావము.

అది తప్ప యితరములగునవన్నియు అసత్యములు, మిథ్యాభూతములు. ఇవి మాత్రము నిర్దేశార్థములై యుండును.

నీవు ఒక కుర్చీయందున్నావనుకో. నిన్ను పలువురు సేవించుచున్నారు; అవి యన్నియూ మిథ్యాభూతములు. ఉదాహరణమునకు, ఒక పల్లకీ తీసికొందము. దీనికిముందు అది ఒక వృక్షమైయుండెను; అనంతరము కట్టెగా మారెను; పిదప పల్లకిగా మారెను. ఇట్లే రూపము మారుచూ పేర్లు కూడా మారినవి. పల్లకి యందున్న నిన్నెవరయిననూ, వృక్షమునందున్నావనియో, లేక కట్టెయందున్నావనియో చెప్పగలరా? చెప్పలేరు. ఇట్లు పదార్థములు మారుచుండును; వీనికి స్థిరత్వము లేదు. కాని, యివి 'సత్' కానేరవు గదా? నామరూపములతో వీనిని వ్యవచ్ఛేదింప వచ్చును. 'ఇది యిట్టి' దని లక్షణముకూడా చెప్పవచ్చును. మరియు నివి నశ్వరములు, కల్పితములగుటయే దీనికి కారణము.

**కడకు మిగులునది ఆత్మధర్మమే :**

పరిశీలించి చూతము. కుర్చీ అనిననేమి? కట్టెల రచనా విశేషము కదా? ఈ కట్టెలను వేరుపరచి గమనించుము. కుర్చీని నీ వెట్లు చూడగలవు? కట్టెలే కదా నీకు గోచరమగును? ముందున్న కుర్చీ ఏమాయెను? నశించిపోయెను. ధర్మమునకు కూడా యిదే న్యాయము. ఆ ధర్మమనియు, ఈ ధర్మమనియు, వర్ణ ధర్మమనియు, గృహస్థ ధర్మమనియు, వానప్రస్థ ధర్మమనియు, సన్యాస ధర్మమనియు, బ్రహ్మచర్య ధర్మమనియు అనేక ధర్మ రూపములు కట్టెలతో చేసిన కుర్చీ, బెంచీ, పల్లకీ వంటివి. లోతునకు విచారించి పరికించిన అవి విడిపోవునట్టి దేహధర్మములే. కడకు మిగులునది

ఆత్మధర్మమే. కుర్చీలు మరుగై, కట్టెలు కనుపించినట్లు, ప్రకృతి ధర్మములు మరుగై ఆత్మధర్మము సాక్షాత్కరించును.

అయితే, లోకానుభవమునకు దేహధర్మములుకూడా అత్యవసరము. వానిని కాదనను. కట్టెలను ఏ రీతిగా, మన లోకానుభవ నిమిత్తమై కొన్ని పనిముట్లుగా చేసికొనుచున్నామో, అటులనే ఆత్మధర్మమును, సత్యధర్మమును, సనాతన ధర్మమును, లోకానుభవ నిమిత్తమై ఆచరించు గృహస్థధర్మము, సన్యాసధర్మము, వర్ణధర్మము, స్త్రీధర్మము, పురుషధర్మము అను పనిముట్లుగా తయారుచేసికొన్నచో ధర్మమెందుకు మారెను? ఎందుకు నశించును? అయితే, చెట్టును కొన్ని రీతులుగ చక్కపఱచి, ముక్కలుచేసి, వస్తురూపమునకు తగినట్లుగా మార్చవచ్చును కదా? అట్లే, ఆత్మధర్మమను వృక్షమును ముక్కలుచేసి వినియోగార్థము తగినట్లుగా మార్చవచ్చును కదా? అని కొందరు శంకించవచ్చును. నిజమే, యే రూపును నీవు తీర్చిదిద్దిననూ ఆత్మధర్మమను వృక్షమునుండియే ఆ సారమును తీసికొన్న ధర్మము నశింప వీలుండదుకదా? లోకధర్మకర్మలను, ఆత్మధర్మమను వృక్షమునుండి యే రీతిగా తీసికొన్నను, తీర్చిదిద్దిననూ దోషములేదు. ఆత్మధర్మములను లోకధర్మముల రూపములకు లోబరచకుండిన చాలును.

**ధర్మమే యోగము, ధర్మమే సత్యము :**

అనగా, చెట్టును ఎన్ని రకములైన సామానులుగానైనా చేయవచ్చును. కానీ సామానులను చెట్టుగా చేయుట అసాధ్యం. అట్లే ఆత్మధర్మములందు ఇమిడ్చి ఆచరించవచ్చును కానీ,

లోకధర్మములను ఆత్మధర్మమందు నిరూపించిన, అది అధర్మమగును; సత్యధర్మమును మరుగుపరచుట అగును. అంతియేకాక, ధర్మ ద్రోహమునకు కూడా పాల్పడిన వారగుదురు. ధర్మమే నైతిక వర్తనము; నైతికవర్తనమే జ్యోతి, జ్యోతియే ఆనందస్వరూపము. పవిత్రత, శాంతి, సత్యము, క్షమ, అన్నియూ ధర్మముయొక్క స్వరూపములు. ధర్మమే యోగము, ధర్మమే సత్యము.

ప్రతీదీ ధర్మముపై ఆధారపడియున్నది. న్యాయము, ఇంద్రియ నిగ్రహము, మర్యాద, సహనము, మంచితనము, ధ్యానము, గాంభీర్యము, అనురాగము, అహింస, అన్ని గుణములూ ధర్మముయొక్క స్వభావములై యున్నవి. ధర్మం శాశ్వతమైనది. ధర్మమునే ఆరాధించిన, విశ్వప్రేమను పొందవచ్చును. ధర్మమునకు మించిన సాధనలేదు. ధర్మమే సృష్టికి కారణం. సత్యధర్మం మీదనే జగత్తు నిలువగలిగినది. సత్యమనునది ధర్మములో లీనమైయున్నదే. సూర్యచంద్రాదులు సహితము ధర్మమును ఆచరిస్తూ తప్పక తిరుగుచున్నారు. దానధర్మములు, వేదములు, మంత్రములు, జ్ఞానము, అంతయూ సత్యధర్మమే. ధర్మమే శాసనము. ఎక్కడైతే నైతిక ప్రవర్తనమున్నదో, అక్కడంతా సత్యధర్మమున్నది.

అందుకనే భాగవతమందుకూడా "ధర్మమెక్కడో అక్కడ కృష్ణుడుండును; ధర్మమూ కృష్ణుడూ ఎక్కడ ఏకస్వరూపులగుదురో అక్కడ జయముండును" అని చెప్పబడెను. కాన, ధర్మము భగవంతుని దేహము. లోకమే భగవంతుని దేహమైన యిక లోకము ధర్మస్వరూపమే కదా? కాదని ఎవరు చెప్పగలరు? చెప్పలేరు. చెప్పరాదు.